# సాతాను లోకమును పాలించును

**పాఠ్యోద్దేశం :** మానవునికి సంబంధించి సాతాను యొక్క స్వభావము మరియు శక్తిని నిర్వచించుట.

## ఉపోద్ఘాతము

పాత నిబంధనలో "సాతాను" అను మాట తర్జుమా చేయబడిన హెబ్రీ పదము. క్రొత్త నిబంధనలో సాతాను అనుమాట "సాటానస్' (SATANAS) అను గ్రీకు పదము నుండి తర్జుమా చేయబడినది. విరోధి అని దాని అర్థము. "డయాబొలాస్" (DIA BOLOS) అను గ్రీకుపదము, అపవాదియని తర్జుమా చేయబడినది. సాతాను కీయబడిన నామధేయ మిదియే. ఫిర్యాది లేక దూషకుడని దాని భావము. కావున, వాడు దూషించువాడైయున్నాడు. తన ప్రత్యక్షతలో యోహాను సాతానును ఆదిసర్పమ నియు, అపవాది అనియు, ఘటసర్పమనియు ఈ క్రింది లేఖనములో గుర్తించెను.

> *కాగా సర్వలోకమును మోసపుచ్చుచు, అపవాదియనియు సాతాననియు పేరుగల ఆదిసర్పమైన ఆ మహాఘట సర్పము పడద్రోయబడెను. అది భూమి మీద పడ ద్రోయ బడెను దాని దూతలు దానితో కూడా పడద్రోయబడిరి. ప్రకటన. 12:9.*

## పాఠము

సాతాను ఎక్కడి నుండి వచ్చెను? అను ప్రశ్న బైబిలు విద్యార్థులచే తరుచుగా చర్చింపబడు చున్నది. "సాతాను మెరుపువలె ఆకాశమునుండి పడుట చూచితిన"ని యేసు చెప్పెను (లూకా 10:18). వాడు దేవునిపై తిరుగుబాటు చేయుటకు దేవ దూతలను ప్రేరేపించి, పరలోకమునుండి పడద్రోయబడెనని చెప్పు ఒక ప్రసిద్ధమైన సిద్ధాంతము గలదు (యూదా 6; 2 పేతురు 2:4). సాతాను స్వభావమును బట్టి యీ సిద్ధాంతము చూపునకు నమ్మశక్యముగా అగుపించును. అయినప్పటికిని, వాని ప్రారంభమును గూర్చి సరియైన వివరణలు తెలియజేయు లేఖనభాగము లను మనము కనుగొనలేము. వాని అంతమును గూర్చి మనమెరుగుదుము. అగ్నిగుండమునకును, అగ్నిగంధములకును పోవుమార్గమునందు సాతాను పయనించుచున్నాడు. (ప్రకటన 20:10) క్రీస్తు వచ్చు పర్యంతము దేవుని విరోధిగానే కొనసాగుట వాని యొక్క ఆఖరి అవకాశము. వాడు నరకము నకు పోవుచున్నాడు. అంతేకాదు, సాధ్యమైనంత మందిని తనతో పాటు నరకమునకు తీసికొని పోవుటకు వాడు నిర్ణయించుకొనినట్లు కనుపించుచున్నది. గనుక శక్తిమంతుడైన ఈ చెడ్డ వ్యక్తి యొక్క స్వభావమును గ్రహించుటకిది మనలను తప్పక ప్రేరిపించును. మనలో ఒక్కొక్కరిని (one of the basis) దక్కించుకొనుటకు వాడు పనిచేయుచున్నాడు.

"లోకమునందు" అను పరిధిలో పరిపాలన సాగించుచున్న శక్తివంతమైన వ్యక్తి సాతాను. అనేక దయ్యములతో వాడు ఒకరాజ్యము కలిగియున్నాడు. (మత్తయి 12:26). యేసు సాతాను కంటె అధికమైన శక్తిగలవాడు. యేసు అపవాదిని, కేవలము "క్రీస్తు నందున్న" విశ్వాసి విషయములో మాత్రమే శక్తిహీనునిగా చేసెను. "లోకము నందు" అను పరిధిని ప్రభావితము చేయుచున్న తత్వజ్ఞానములో (philosophy) అధిక భాగమునకు మూలాధారము సాతానే (ఎఫెసీ. 1:21; 6:10-12) వాని యొక్క పనులు పాపభరితములు. వాటి జీతము మరణము (1 యోహాను 3:8; రోమా. 6:23). సాతాను ఒక హంతకుడు (యోహాను 8:44). మానవాళికి వాడు మరణము తెచ్చెను. లోకములోని జనులు సాతాను క్రియలనే చేయుదురు. కావున సాతాను మరణము యొక్క బలమును కలిగియున్నాడు (హెబ్రీ 2:14)

మానవుని యొద్ద దేవునిపై నేరారోపణ చేయుట ద్వారా మానవునికి సంబంధించి తన చర్యలను సాతాను ఆరంభించెను. దేవునివలె వారగదురు గాన, మంచిచెడ్డల వృక్షఫలమును తినుటకు ఆదాము -హవ్వలకు దేవుడు అనుమతి నీయలేదని వాడు హవ్వతో చెప్పెను (ఆది. 3:5). దేవుని ఎదుట మానవుని పై కూడా సాతాను నేరారోపణ చేసెను. తాను పొందిన భౌతిక మేలులను బట్టియే యోబు దేవునికి విధేయత చూపెనని వాడు పలికెను (యోబు 1:10; 2:4,5).

హవ్వతో వాడు తారసపడిన విధమును బట్టి వాని యొక్క ఉద్దేశ్యములు శక్తి మరియు స్వభావములను అవగాహన చేసికొనుటకు ఆరంభించగలము. మోసము చేయు వాని యొక్క **స్వభావము,** హవ్యతో వాడు కొనసాగించిన సంభాషణలో ప్రత్యక్ష పరచబడుచున్నది (ఆది. 2:1-7). హవ్య నిజముగా మోసపోయినది (1 తిమోతి. 2:14; 2 కొరింథీ. 11:3). సాతాను తన స్వకీయ స్వభావము ననుసరించి మాటలాడును. వాని స్వభావము అబద్ధముతో నిండినది (యోహాను. 8:44). దేవుని యొక్కయు, యేసు యొక్కయు స్వభావములో సత్యము కనుగొనబడును. కాబట్టి, సత్యమునే వారు పలుకుదురు. దేవుడు అబద్ధమాడజాలడు (తీతు 1:2). వానికేమైనా లాభ ముంటేనే తప్ప సాతాను సత్యమును చెప్పజాలడు. అసత్యములతో లోకమునందలి మనుష్యులను మోసము చేయుటలో సాతానుకు తీరికలేదు. (ప్రకటన 12:9) సాతాను అబద్ధికుడు గనుక వాడు వెలుగుదూత వేషము వేసికొని **తంత్రముల ద్వారా** పనిచేయును (2 కొరింథీ. 2:11; 11:14)

అపవాది తన లక్ష్యములను సాధించుకొనుటలో ఎంతవరకు వెళ్ళునో, వాని స్వభావమే తెలుపును. దేవుని నుండి మనలను వేరుచేయుటయే వాని యొక్క లక్ష్యమని మనము జ్ఞాపకముంచు కొనవలెను. పాపములోనికి మనలను నడిపించుట ద్వారా మాత్రమే, వాడి లక్ష్యమును సాధించ గలడు. పాపము, కేవలము పాపము మాత్రమే మానవులను దేవుని నుండి వేరుచేయ గలదు. సాతాను పాపి కావున, ఆజ్ఞాతిక్రమము ద్వారా మానవులను **మ్రింగివేయును** (1 యోహాను 3:8; 1 పేతురు 5:8).

తనకు చెందినవారని ఎవరి విషయములో సాతాను తలంచునో, అట్టివారి కొరకు వాడు వాదించును (యూదా 9; లూకా 23:31). మన విరోధియైన సాతాను స్వభావమిది. దేవుని నుండి మనలను వేరుచేయు తన లక్ష్యమును సాధించుటకు తన స్వభావము నుండియే పనులు చేయును. మన అతిక్రమక్రియలనుబట్టి మనము దేవుని నుండి వేరు చేయబడిన పిమ్మట, మన పాపమే మన యాజమని అగును. మన బ్రతుకులు పాపమునకు వశమైనప్పుడు, సాతాను చేయవలసినదల్లా మనము మోసములో కొనసాగునట్లు చూచుటయే (ఎఫెసీ 4:22; ప్రకటన 20:8-10) అట్టి పనిని చేయుటకు కావలసిన గుణ లక్షణములన్నంటిని వాడు కలిగియున్నాడు.

సాతాను “పట్టువంటినునుపు” (smooth as silk) గలవాడు. కాని, వాని ఉద్దేశ్యములన్నియు నీచాతినీచమైనవి. మనము వాడికి కావలసిన వారముకాము. కాని, ప్రేమాస్వరూపియైన పరలోకపు తండ్రి నుండి మనలను దూరము చేయుటేవాని ఏకైక అభిలాష. దేవుడు మనలను కోరుచున్నాడు. (నిర్గయ 20:4; యాకోబు 4:5) సాతాను దేవుని సూటిగా ఎదిరించలేడని వానికి స్పష్టముగా తెలుయును. అందువలన వాడు దేవుని పిల్లలపై దాడి చేసెను. మంచిచెడ్డల తెలివిగల మానవ శరీరములో యేసు ప్రవేశించినపుడు, సాతాను ఆయనను కూడా ఎదిరించెను (లూకా 4:1-13) పలు రకముల శోధనలతో మూడు సార్లు ప్రయత్నించిన తర్వాత, సాతాను మొదటి దఫా పోరాటములో ఓడిపోయినందులకు మనము ప్రభువుకు ధన్యవాదాలు తెలపాలి. యేసు సిలువపై మన పాపములు భరించి శ్రమలన్నింటిని సహించినప్పుడు, సాతాను యేసుతో పోరాడిన ఆఖరి దఫా పోరాటములో ఓడిపోయెను (హెబ్రీ. 2:14). మరణపు ముల్లు పాపము (1 కొరింథీ. 15:56).

తన యొక్క ఉద్దేశములను నెరవేర్చుకొనుటకు సాతానుకు ఎంత శక్తియున్నది? వాని యొక్క శక్తి యావత్తును **అసత్యము యొక్క శక్తి**పై ఆధారపడియున్నది. క్రీస్తు మహిమ సువార్తలను మరుగుచేయుట ద్వారా మనవులను అవిశ్వాసులుగా నుంచు టయే సాతాను విజయమునకు అసలు కీలకము (2 కొరింథీ. 4:4-6). నిజమైన జీవము విషయములో మానవులను అజ్ఞానులుగా నుంచుచూ తన రాజ్యమును కొన సాగించుకొనగల సామర్థ్యమును వాడు కలిగియున్నాడు. (అపో. కార్య. 26:18). మన సహజకోరికలను తృప్తిపరచుకొనుటకు అన్యాయమైన విధానములను అనుగ్రహించు టయే వాని కార్యక్రమమై యున్నది. (ఎఫెసి. 2:1-3).

లోకములోని నిమ్న, ఉన్నతస్థానములలో కూడా వాని ప్రభావము కనబడును (ఎఫెసీ. 6:11, 12). మానవులను అధికారము గల పదవులలో వాడు నియమించును (మత్తయి 4:8,9). దేవుని బిడ్డలను మరణము వరకు హింసించునట్లు సాతాను రోమా ప్రభుత్వమును ఉపయోగించు కొనిన విధమును ప్రకటన గ్రంథములో మనము తెలిసికొనగలము (ప్రకటన 6:10). తానే దేవుడునని చెప్పుకొన్న శక్తిగల అన్యుడైన ఒక రాజును వాడు కలిగియుండగోరును (2 థెస్స. 2:3,4).

“లోకమునందు” అను స్థితి లోని అనేక శక్తుల మీద తాను ప్రభావము కలిగి యున్నందున, క్రైస్తవులకు సమస్యలు కలిగించుటకు వానికి శక్తి కలదు. అజ్ఞానము, పాపము అను వాటి స్థానములో, సువార్తయందలి మన విశ్వాసము క్రియ చేయు నప్పుడు సాతాను యొక్క శక్తి తరుగుచుండును (1 పేతురు 5:8,9).

## చర్చ కొసం ప్రశ్నలు

1. లోకాధికారి గుర్తింపుబడు వివిధ మార్గములను తెలుపుము?
2. సాతాను యొక్క క్రియల ఫలమును వివరించుము?
3. ఒక వ్యక్తిపై మరణము యొక్క బలమును సాతాను ఎట్లు సంపాదించును?
4 సాతాను యొక్క ప్రారంభమును స్థిరపరచు ఒక లేఖనమును కనుగొనగలవా?
5. సాతాను స్వభావమును తెలుపు 5 లక్షణములను వ్రాయుము?
6. సాతాను యొక్క శక్తికి ఆధారమును చక్కగా వివరించు ఒక పాపమును బయలు పరచుము?
7. సాతాను తన యొక్క శక్తి క్రింద మానవులనుంచుకొనుట కాధారమైన మూడు మానవ బలహీనతలను వ్రాయుము?
8. నశించిన స్థితిలోనే మానవులను ఉంచుటకు సాతాను దేనిని మరుగు చేయవలసి యున్నది.
9. “ఉన్నతస్థానముల”లో సాతాను ఎట్లు పని చేయును?
10. సాతాను ఎక్కడికి పోవుచున్నాడు? తనతో తీసుకొని పోవుటకు ఎవరిని కోరుకొను చున్నాడు?